క్లుప్తంగా

ఓపెన్ జిమ్ పనుల పరిశీలన



కృష్ణాకాలనీ పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ కృష్ణా కాలనీ పార్కులో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఓపెన్ జిమ్, పార్కుల అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. మంగళవారం పార్కును కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, మహ్మద్ అలీ, మునువర్ చాంద్, జబ్బార్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, గణపతి దేవస్థానం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, క్రాంతి రెడ్డి, డీఈ సన్నీ తదితరులున్నారు.

కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్‌గా బాలాజీ



కాచిగూడ: రైల్వే ప్రయాణీకులకు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ అన్నారు. కాచిగూడ రైల్వేస్టేషన్ డైరెక్టర్‌గా మంగళవారం నూతనంగా ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో ప్రయాణీకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తానన్నారు. ప్రయాణీకులు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు నగదు అందజేత



నగదు బహుమతులను అందజేస్తున్న కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు నగదు సాయాన్ని కార్పొరేటర్ అందజేశారు. వారి మధ్యే కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు తనవంతు అండగా ఉంటానని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, రాజు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండారి యాదగిరికి శ్రమశక్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న బండారి యాదగిరి

కవాడిగూడ: స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, కార్మిక నేత బండారి యాదగిరికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి శ్రమశక్తి అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం కవాడిగూడలో యాదగిరి మాట్లాడుతూ.. శ్రమశక్తి అవార్డుతో కార్మికులకు చేయాల్సిన సేవలు మరింత పెరిగాయని కార్మికుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కార్మికుల పక్షాన నిలబడి హక్కుల కోసం పోరాడతామన్నారు. శ్రమశక్తి అవార్డు రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్మికులు, రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం

చిక్కడపల్లి: శ్రీ లహరి క్లాసికల్ డాన్స్ అకాడమీ, మెట్రో టీవీ, త్రినేట్ టీవీల సంయుక్త ఆధ్వర్యంలో సంఘసేవకులు, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు కె.మురళీధర్‌రెడ్డిని సన్మానించారు. మంగళవారం అన్నమయ్య, నటరాజ అవార్డులను కొండవీటి జయప్రసాద్, వెంకట్, డాన్స్ అకాడమీ సభ్యులు సంధ్యారాణిలు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురికి కళాకారులు, గురువులు అచ్యుతాంబ, వర్శిణి, దీక్షిత, గిరిధర్, చిత్ర, స్వాతి, మహేశ్వరి, శ్రీనివాస్, అశోక్‌లకు అన్నమయ్య, నటరాజ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రాందాస్ తేజవత్, శీర్షి, అలివేలు మంగ, చిన్మయితమ్మారెడ్డిలు పాల్గొన్నారు.

కానరాని పారిశుద్ధ్యం!

- పారిశుద్ధ్య నిర్వహణలో అధికారుల అలసత్వం
- ప్రబలుతున్న విషజ్వరాలు

స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యంగా కాచిగూడ డివిజన్‌లో ఇంటింటికీ చెత్త డబ్బాల పంపిణీకి లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసేందుకు వీలుగా నీలం, ఆకుపచ్చ రంగు డబ్బాలను జీహెచ్‌ఎంసీ అందజేసింది. దీనికి వెచ్చించిన నిధులు మాత్రం బూడిదలో పోసిన పన్నీరే అయ్యిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కుద్బీగూడ సెంట్ పాల్స్ స్కూల్ రోడ్డులో ఇలా..

కాచిగూడ: కుద్బీగూడలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రధాన రహదారులు, వీధుల్లో రోజుల తరబడి చెత్తకుప్పలు పేరుకుపోతుండగా.. ఆయా ప్రాంతాల్లో దుర్వాసన, దోమలు వృద్ధి చెంది స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం దోమల నివారణకు చర్యలు చెపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు.

- చెత్తకుండీల రహిత నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో డంపింగ్ బిన్‌లను ఏర్పాటు చేసినా జనం వ్యర్థాలను రోడ్లపైనే పారవేస్తున్నారు.
- కాచిగూడ మేయిన్ రోడ్డు నుంచి కుద్బీగూడ మీదుగా ఇసామియాబజార్ మెయిన్ రోడ్డు వరకు అడుగడుగునా వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.
- సెయింట్ పాల్స్ స్కూల్ సమీపంలోని గణేష్ టెంపుల్ వద్ద, మహాలక్ష్మి మిల్క్ సెంటర్ వద్ద, కుద్బీగూడ ఖాళీ స్థలం తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన చెత్త కుప్పలు పేరుకు పోయాయి.
- ఈ వ్యర్థాలను తొలగించడంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది విస్మరిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో చెత్త కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మహాలక్ష్మి సెంటర్ వద్ద..



కుద్బీగూడ రోడ్డులో..

సిబ్బంది నిర్లక్ష్యం..

ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక వాహనాలు, రిక్షాలతో వ్యర్థాలు సేకరిస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రకటించారు. దీనికోసం ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. అయితే చాలా బస్తీల్లో ఈ విధానం అమలు కాకపోవడంతో జనం యథావిధిగా రోడ్లపై చెత్తను పారవేస్తున్నారు. దీంతో రోగాల బారిన పడి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని ప్రాంతాల్లోనే ఫాగింగ్..

- వర్షాలతో తడిచి ముద్దయిన చెత్తతో రోడ్లపై నిలిచిన డ్రైనేజీ నీటితో కుద్బీగూడలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటి నివారణకు చేపట్టే చర్యలు అన్ని ప్రాంతాలకు చేరడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

- రోడ్లపై రోజుల తరబడి చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోతున్నా.. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కింది స్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చెత్తను రోడ్లపై వేయకుండా రోడ్లపై ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్త తొలగింపులో అధికారుల అలసత్వం వద్దు..



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: రోడ్లు, బస్తీల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపులో అలసత్వం ఉండకూడదని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై పేరుకు పోయిన చెత్తకుప్పలు, మట్టిదిబ్బలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు.

- పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.
- పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెత్తను తొలగించడం లేదని రోడ్లను సరిగ్గా ఊడ్చడం లేదని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. చెత్తను తొలగించకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌ఓ జ్యోతిబాయి, లాల్‌బాషా, దిన్‌సిల్, తిరుపతి నాయక్, విష్ణు, దేవా, సోమయ్య, నర్సయ్య, బీజేపీ నాయకులు కన్నె ఉమా రమేష్‌యాదవ్, సుభాష్ పటేల్, వాసు, దిలీప్, రాజ్‌కుమార్, ఆర్.సంతోష్, అరవింద్, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, సూరి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 'పీపుల్స్ మార్చ్'లో స్థానిక నేతలు



పాదయాత్రలో పాల్గొన్న సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, అంజిరెడ్డి తదితరులు

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ సీఎల్‌పీ నాయకులు బట్టి విక్రమార్క ఆలేరు నియోజకవర్గంలో చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రలో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, ట్రేడ్ యూనియన్ నాయకులు నల్లవెల్లి అంజిరెడ్డి, ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరాముల యాదగిరి తదితరులు పాల్గొని బట్టితో కలిసి నడిచారు.

- పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఈ రెండు ప్రభుత్వాలు ప్రజలకు తీరని అన్యాయం చేశాయని ఆరోపించారు.
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు.
- రాష్ట్ర ప్రభుత్వం విపరీతంగా అప్పులు చేస్తూ.. ప్రజలపై భారం మోపుతోందని నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నా.. దాన్ని తీర్చడంలో విఫలం చెందారని ధ్వజమెత్తారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు రుణాలు మాఫీ చేసి విత్తనాలు, ఎరువులు సబ్సిడీకి ఇచ్చి రైతాంగాన్ని ఆదుకున్నారన్నారు.
- రైతు బంధు ఇచ్చిన ఎరువులు, విత్తనాల రేట్లు పెంచి గిట్టుబాటు ధర లేకుండా రైతుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సచివాలయానికి గ్రీన్ రేటింగ్‌పై హర్షం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర పాలనా భవనం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయానికి గ్రీన్ రేటింగ్ పురస్కారం దక్కడంపై ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్.రంగయ్య హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర పాలనకు కేంద్ర బిందువైన సచివాలయ నిర్మాణంలో పాటించిన పర్యావరణ హిత విధానం స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే కోట్లాది మొక్కలు నాటేలా హరితహారం కార్యక్రమంతో పర్యావరణ వైతాళికుడిగా మారిన సీఎం కేసీఆర్ ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు.

గ్రాఫిక్ డిజైన్‌లో ఉచిత శిక్షణ.. దరఖాస్తులకు ఆహ్వానం

- శివం ప్రాంగణంలో ఈ నెల 7న ప్రవేశ పరీక్ష
- 8 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం

నల్లకుంట: శ్రీ సత్య సాయి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిరుద్యోగ యువకులకు అడ్వాన్స్‌డ్ కాన్సెప్ట్, గ్రాఫిక్ డిజైన్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బ్రాండ్ ఐడెంటిటీ డిజైన్, యూజర్ ఇంటర్ ఫేస్ డిజైన్, ఇన్ఫోగ్రాఫిక్ డిజైన్, ప్యాకేజింగ్ డిజైన్, ఎడిటోరియల్ డిజైన్, లైఫ్ స్కిల్స్ తదితర విభాగాల్లో శిక్షణ ఉంటుందని ఆర్గనైజేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

- నల్లకుంట శివం ప్రాంగణంలో ఈ నెల 7న ఉదయం 9 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. డిగ్రీ ఉత్తీర్ణులై కంప్యూటర్‌లో ప్రవేశం, ఫోటోషాప్, కోరల్ డ్రా పరిజ్ఞానం ఉండి 28 ఏళ్ల లోపు ఉన్న యువకులు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు.
- ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 45 రోజుల పాటు శివం ప్రాంగణంలో ఆయా కోర్సుల్లో శిక్షణ ఉంటుందని ఈ నెల 8 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

కాచిగూడ: దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి భార్య కావ్యరెడ్డి అన్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా మంగళవారం 'అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక' జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో దివ్యాంగులు బర్కత్‌పురలో ఆమెను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కావ్యరెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. దివ్యాంగులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వారికి స్వయం ఉపాధి కల్పించడంలో అటల్ బిహారి వాజ్‌పేయి ఫౌండేషన్ ముందుంటుందని వివరించారు. భిక్షపతి, సరిత, శ్రావణ్, శ్రీనివాస్, శంకర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



కావ్యాకిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

వర్షాలతో ఇబ్బంది కలగకుండా చర్యలు



బస్తీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: వర్షాలు పడుతున్నందున బస్తీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అధికారులను కోరారు. మంగళవారం డివిజన్‌లోని అరుంధతీనగర్, సబర్మతీనగర్ ఇరిగేషన్ శాఖ ఏఈ శ్యామ్‌సుందర్, పర్యవేక్షకులు రవితో కలసి కార్పొరేటర్‌పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరదనీరు నాలాలోకి వెళ్లేలా హోల్స్ వద్ద మట్టిని తొలగించాలని సూచించారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కృషిచేస్తున్నామన్నారు. బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షులు రత్నాసాయిచంద్, నాయకులు శ్రీకాంత్, ఎం.ఉమేష్, నవీన్‌కుమార్, జీడీ రాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై ప్రభుత్వానికి అనుమానం వచ్చి స్వచ్ఛందంగా విచారణకు ఆదేశిస్తే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రాజకీయ స్వార్థం కోసం పసలేని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ పార్టీ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాస్‌రావు మండిపడ్డారు. దళిత బంధులో లోపాలను సరిదిద్దేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నాలు చేస్తుంటే ప్రతిపక్షాలు రాజకీయం చేయడం శోచనీయమన్నారు. మంగళవారం అశోక్‌నగర్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం ఎంతో ధైర్య సాహసాలతో టీఎస్‌పీఎస్సీలో జరిగిన తప్పిదాన్ని సమాజం ముందుకు తీసుకొచ్చారన్నారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. పథకాల అమలులో ఎక్కడా తప్పులు జరగకుండా ప్రజా ప్రతినిధులను హెచ్చరిస్తూ.. అవినీతికి తావులేకుండా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌ను విమర్శించే విపక్ష నేతలకు లేదన్నారు.

నీరా కేఫ్ ప్రారంభానికి ఆహ్వానం



కల్లు గీత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో ఈనెల 3న ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్న నీరా కేఫ్ ఉత్సవంలో కల్లు గీత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వీ రమణ పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొంటారని తెలిపారు. నీరా కేఫ్ ప్రారంభోత్సవానికి గౌడ్‌లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం



డ్రైనేజీ సమస్యపై ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

కవాడిగూడ: కవాడిగూడ ఎల్‌ఐసీ కాలనీలో చాలా ఏళ్లుగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులకు త్వరలోనే నూతన పైపులైన్‌ను ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఎల్‌ఐసీ బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్ అధికారులతో కలిసి ఎల్‌ఐసీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కాలనీవాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎల్‌ఐసీ కాలనీలో ప్రధానంగా పురాతన డ్రైనేజీ వ్యవస్థ వల్ల కాలనీవాసులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు.

- అంతర్గత రోడ్లను సైతం ఆధునీకరిస్తామని ఎల్‌ఐసీ ప్రాంగణంలో ఉన్న పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.
- డ్రైనేజీ పైపులైన్ల ఆధునీకరణ తరువాతే రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, ఏఈ శ్రీధర్, మున్సిపల్ డీఈ సన్నీ, ఏఈ సుభాష్, ట్రాన్స్‌కో ఏఈ సత్య ప్రసాద్, మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, కాలనీ అధ్యక్షులు కే.వీ.రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ఎల్‌ఐసీ కాలనీవాసులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్ : తెలంగాణలో కార్మిక లోకం ఆత్మ గౌరవంతో జీవించేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు రూ.1000 వేతనం పెంపుపై మంగళవారం గోల్నాకలో కార్మికులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై సీఎం చేస్తున్న కృషికి కార్మికులు, బడుగు బలహీన వర్గాలు అండగా ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గోల్నాక లంక బస్తీల్లో ప్రజా సమస్యలపై పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా భద్రతలో సీసీ కెమెరాలు కీలకం

అంబర్‌పేట: ప్రజా భద్రత, నేరాలను ఛేదించేందుకు సీసీ టీవీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని అంబర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. బస్తీ, కాలనీ పెద్దలు సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో బస్తీవాసులు ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలను సోమవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ అశోక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఒకొక్క సీసీ కెమెరా సెక్యురిటీ గార్డులా పనిచేస్తుందని సాధ్యమైనంత ఎక్కువగా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అడ్మిన్ ఎస్సై మల్లేష్, బస్తీ పెద్దలు గందమల్ల ఆనంద్‌గౌడ్, బీరప్ప, పులి నారాయణ, ఈశ్వర్, జక్కయ్య, రమేష్, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, బాబురావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ అశోక్

నైపుణ్యాల పెంపుతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న మొహమ్మద్ మసూద్ అహ్మద్

కాచిగూడ: కష్టపడి పనిచేసేతత్వం భారత్‌లోని యువత సొంతమని ఈ నేపథ్యంలోనే వారంతా ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారని ఇండియన్ మేనేజ్‌మెంట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏఐఎంఎస్) మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ మొహమ్మద్ మసూద్ అహ్మద్ అన్నారు. మంగళవారం కాచిగూడలోని మర్వాడి శిక్షా సమితి లా కాలేజ్, ఆర్‌జీ కేడియా కళాశాలలో 'లెర్నింగ్ ఫ్రమ్ కాలేజ్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. అనేక రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. మార్వాడి శిక్ష సమితి సంయుక్త కార్యదర్శి ఎస్‌బీ కాబ్రా, డైరెక్టర్ ప్రొఫెసర్ డీవీజీ కృష్ణ, లా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీఎస్ ప్రదీప్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అంబర్‌పేట: పేదింటి ఆడపిల్ల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. అంబర్‌పేట్ మండల పరిధిలో 81 మందికి కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసరా పెన్షన్ వంటి పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు తెలంగాణలో దాదాపు ప్రతి ఇంటికి చేరుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, అమృత, తహశీల్దార్ సీహెచ్.లలిత, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాచిగూడ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో సీఎం కేసీఆర్ పేదింట్లో ఆడపిల్ల పెళ్లి చేయడానికి పెద్దన్నలా ఆర్థికసాయం అందిస్తున్నారని బీఆర్‌ఎస్ హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు సుతారి యాదగిరి పటేల్ అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్, బగ్గిఖానాకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులు సీమకు నాంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన కల్యాణలక్ష్మి చెక్కును అందజేశారు. బీఆర్‌ఎస్ నేతలు ప్రభాకర్, క్రిష్ణ మద్రి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ -15 ఏసీపీగా మంజులాసింగ్



మంజులాసింగ్‌ను సన్మానిస్తున్న డీఎంసీ యాదయ్య

ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ సర్కిల్ – 15 పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గం టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా మంజులాసింగ్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా పని చేసిన గంగవరపు పావని యూసుఫ్‌గూడ సర్కిల్‌కు బదిలీపై వెళ్లగా.. ఆమె స్థానంలో మంజుల నియమితులయ్యారు. గతంలో సర్కిల్–15లో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేసిన ఆమె ఏసీపీగా పదోన్నతి పొంది చార్మినార్ పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీగా పని చేశారు. సాధారణ బదిలీలలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గానికి వచ్చిన మంజులాసింగ్ ఏసీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మంగళవారం డీఎంసీ తిప్పర్తి యాదయ్య ఏసీపీని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో నిర్మాణాలకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా అమలు చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.



మండల కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ చంద్రకళ, ఎమ్మెల్యే

లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ మండల పరిధిలో 58,59 జీవో లబ్ధిదారులకు మండల కార్యాలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షాదీముబారక్ సంబంధించిన 17 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లో ఆదరణ పొందిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ సంక్షేమ పథకాలే తిరిగి తమ ప్రభుత్వం ఏర్పాటయ్యేలా చూస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, మండల తహసీల్దార్ చంద్రకళ, గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, శ్రీను, జనార్దన్, నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.